క్లుప్తంగా

చేనేతల అభివృద్ధికి కృషి చేస్తా

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో చేనేతల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులైన పుల్లగూర వెంకట సుబ్బరాయుడు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకముంచి పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పాలాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్ : జనవరి నెల నుంచి అవ్వా తాతలకు ఇచ్చే పింఛన్‌ను రూ.3వేలకు పెంచాలని రాష్ట్ర కేబినెట్‌లో తీర్మాణించడం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కో ఆపరేటివ్ కాలనీలో 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు ఎస్. యానాదయ్య, కార్పొరేటర్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, జేసీఎస్ అధ్యక్షుడు తోటక్రిష్ణ, సేవాదళ్ అధ్యక్షుడు సమరనాథరెడ్డి, శంకరాపురం సింధు, మురళీ, మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు.

మహిళల హక్కులను కాపాడాలి

వైవీయూ : మహిళలకు రాజ్యాంగం, ప్రభుత్వాలు కల్పించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా అన్నారు. శుక్రవారం కళాశాలలో మహిళా సాధికారత విభాగం సమన్వయ కర్త వై. నాగరత్నమ్మ ఆధ్వర్యంలో బాల్యవివాహాలను అరికట్టడం, మహిళా వివక్ష, స్త్రీ విద్య తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గ్రామీణ డాక్ సేవక్స్ (జీడీ ఎస్)లకు ఎనిమిది గంటల పని దినాలు కల్పించాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాము పేర్కొన్నారు. గ్రామీణ డాక్ సేవక్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం నాల్గవరోజు నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నాయకులు కృష్ణయ్య, రఘురామిరెడ్డి, రఫీ, సుబ్బయ్య, మహేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అమరజీవి పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఇందిరా భవన్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చార్లెస్, కోటిపాటి లక్ష్మయ్య, మహమ్మద్ అలీ ఖాన్, కొవ్వూరి శ్రీనివాసులు, చిన్న కులాయప్ప, మామిళ్ళ బాబు, పాలగిరి శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధమవుతామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర కమిటీ అధ్యక్షుడు సుంకరి రవి హెచ్చరించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో నగరపాలక ఇన్‌చార్జి అధికారికి వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. కార్మికుల సమస్య పరిష్కారంపై స్పందన లేనందున ఈనెల 21వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని, కార్మికులంతా సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక గురుకుల పాఠశాలలో జరిగే ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ట్రై సైకిల్స్, చెవిటి మిషన్లు, మూగవారికి టచ్ ఫోన్లు, వికలాంగులకు చంక కట్టెలు, చేతి కర్రలు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మార్పురి మేరి అధ్యక్షతన జరిగే అభివృద్ధి పనులపై రివ్యూ సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారని నగర కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



28వ డివిజన్‌లో ప్రభుత్వ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



25వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే జగనన్నను ఆశీర్వదించాలని టీటీడీ బోర్డు సభ్యులు ఎస్. యానాదయ్య, జేసీఎస్ అధ్యక్షుడు తోటక్రిష్ణ, 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు అన్నారు. శుక్రవారం స్థానిక కో ఆపరేటివ్ కాలనీలో నెహ్రూ పార్కు పక్కన వారు వైఎస్ఆర్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్, సేవాదళ్ అధ్యక్షుడు సమరనాథరెడ్డి, కార్పొరేటర్ నాగేంద్ర, సింధు, మురళీ, వాలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు

తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని నార్త్‌జోన్ జేసీఎస్ అధ్యక్షుడు ఎస్ఎండీ షఫీ, జేసీఎస్ కన్వీనర్ హరూన్ బాబు, 28వ డివిజన్ కార్పొరేటర్ అరీపుల్లా బాషా అన్నారు. శుక్రవారం 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్నో హామీలిచ్చి ఏవీ అమలు చేయకుండా మోసం చేశారన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మళ్లీ మాయమాటలు చెబుతున్నారన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డా. సొహైల్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు చాన్‌బాషా, టీపీ వెంకట సుబ్బమ్మ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని స్కూటర్ యాత్ర



పెద్దదర్గా వద్ద స్కూటర్ యాత్రను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని, కడప ఎమ్మెల్యే ఎస్‌బి అంజద్‌బాషా మళ్లీ ఎమ్మెల్యే, మంత్రి కావాలని కోరుతూ కడప నగరానికి చెందిన వైఎస్సార్‌సీపీ వీరాభిమాని ఎస్. నజీర్ బాషా పెద్దదర్గా నుంచి అజ్మీర్‌కు స్కూటర్ యాత్ర చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం పెద్ద దర్గా వద్ద వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు షఫీ, అజ్మతుల్లా, ఆ పార్టీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు చాంద్‌బాషాలు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నజీర్‌బాషా పెద్ద దర్గా నుంచి రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా షరీఫ్‌కు స్కూటర్ యాత్ర చేపట్టడం సాహసమేనన్నారు. యాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నయీమ్, పీరా తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి ఎంపికైన వైజ్ఞానిక ప్రదర్శనలు

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగి మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు జిల్లాస్థాయికి ఎంపికయ్యాయి. వ్యక్తిగత విభాగంలో గైడ్ టీచర్ జయాకర్ ఆధ్వర్యంలో స్థానిక విద్యార్థిని కరిష్మా ప్రదర్శించిన వాటర్‌ప్యూరిఫికేషన్ సిస్టం, గ్రూపు విభాగంలో ఉప్పలూరుకు చెందిన శివాజీ, మునికార్తీక్‌లు గైడ్ టీచర్ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఆటోమేటిక్ లేసర్ లైట్, ఉపాధ్యాయ విభాగంలో హరిప్రియ రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ ఆక్టివిటీస్ టు టీచ్ స్టూడెంట్ అను ప్రాజెక్టులు జిల్లాస్థాయికి ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయులు రాజబాబు తెలిపారు. ఈనెల 19వ తేదీన ప్రొద్దుటూరులో జరిగే జిల్లాస్థాయి పోటీలో వీరు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శనలో ఎంఈవోలు సుబ్బారావు, నాగేశ్వరరావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్ళ పొదల తొలగింపు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ప్రధాన రహదారికి రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ళపొదలను శుక్రవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి తన సొంత నిధులతో తొలగించారు. గతంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలు రోడ్డుకి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించాలని కోరడంతో ఎమ్మెల్యే తన వ్యక్తిగత కార్యదర్శి కిషోర్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ లక్కిరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు.

ఆర్థిక సాయం

చెన్నూరు : మండలంలోని గుర్రంపాడు పంచాయతీకి చెందిన బుడ్డగాల పక్కిరయ్య కుమార్తె బుడ్డగాల రజనీ వివాహానికి పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శుక్రవారం వధువు తండ్రి ఫకీరయ్యకు రూ.5 వేలు ఆర్థికసాయాన్ని గుర్రంపాడు సర్పంచ్ చల్లా ప్రమీల అందజేశారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కడప కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలను నిర్వహించిన ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టకపోవడం దారుణం అన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరీ, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జికి ఘన నివాళి



కడప ఎడ్యుకేషన్ : ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్/కడప కల్చరల్ / కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మరణం బాధాకరమని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథ రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆకివీడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ సాబ్జి దుర్మరణం చెందారన్నారు. సైన్స్ ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించే స్థాయికి చేరుకోవడం ఆయన పోరాట తత్వానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీగా ఆయన ఉపాధ్యాయుల సమస్యలపై కౌన్సిల్‌లో నమ్మకమైన గొంతుగా పనిచేశారన్నారు. ఆయన అకాల మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు.

- ఎమ్మెల్సీ షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఉద్యమ నేత షేక్ సాబ్జి మృతి ఉపాధ్యాయ లోకానికి తీరనిలోటని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా అన్నారు. శుక్రవారం కడపలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

వల్లూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను కడప డీఎస్పీ షరీఫ్ శుక్రవారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను గురించి, స్టేషన్‌లో వున్న సిబ్బంది గురించి ఆరా తీశారు. త్వరలో రాబోవు ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన విధానాలు, చేపట్టాల్సిన చర్యలను గురించి పలు సూచనలు చేశారు. ఎన్నికలకు అన్ని విధాలుగా సిద్ధంగా వుండాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని, రాత్రి పూట గస్తీని ముమ్మురం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి, ఇంచార్జ్ ఎస్ఐ హృషీకేశవరెడ్డి, సిద్దవటం ఎస్ఐ పెద్దఓబన్న పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు సహనంతో వ్యవహరించాలి

ఇన్‌చార్జి ఈడీ తిమ్మాడి చెంగల్ రెడ్డి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఈడీ తిమ్మాడి చెంగల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రయాణికుల పట్ల ఓపిక, సహనంతో వ్యవహరించాలని కడప జోన్ ఇన్‌చార్జి ఈడీ తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కడప డీపీటీఓ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఇంధన పొదుపు చేయని డ్రైవర్లకు, సెంట్రల్ సెల్ కంప్లెయింట్స్ వచ్చిన సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రయాణికుల పట్ల గౌరవ ప్రదంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా ఓర్పు, సహనం అనేది ముఖ్యమని గుర్తించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీటీఓ పాలిమేర గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ పి.భాస్కర్, ఇన్‌ఛార్జి సీటీఎం హరి, చీఫ్ పర్సనల్ మేనేజర్ గజలక్ష్మి, ప్రొద్దుటూరు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి, రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డి, జమ్మలమడుగు డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్ఎంఏ బాష, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఆర్టీసీ పురోభివృద్ధి

ప్రతి ఒక్కరి కృషితో ఆర్టీసీని పురోభివృద్ధి బాటలో పయనింపజేయడం ప్రశంసనీయమని ఇన్‌ఛార్జి ఈడీ తిమ్మాడి చెంగల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సంస్థ కార్యాలయంలో 2022–23 సంవత్సరానికి అరుణాచలానికి స్పెషల్ సర్వీసులు నడిపినందుకు డీఎం ఢిల్లీశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ కన్యాకుమారితోపాటు ఎంఎఫ్‌లకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పంపిన ప్రశంసాపత్రాలను ఈడీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం గోపాల్‌రెడ్డి, డీఎం తదితరులు పాల్గొన్నారు.

ఘన సత్కారం

ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఈడీగా బాధ్యతలు చేపట్టిన చెంగల్‌రెడ్డిని శుక్రవారం సాయంత్రం యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్మిక పరిషత్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఈడీని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సైన్స్‌ఫెయిర్‌కు విశేష స్పందన

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారులు జాఫర్ సాదిక్, అనితలు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు అన్ని పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. అన్ని విభాగాల్లో ప్రథమ స్థానం నిలిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఈనెల 19వ తేదీన నిర్వహించే జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. వ్యక్తిగత విభాగంలో ప్రథమ బహుమతి లక్ష్మీచరణ్ పాలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మి ద్వితీయ బహుమతి సంగమేశ్వర ఉన్నత పాఠశాల వీరపునాయునిపల్లె, తృతీయ బహుమతి అనురాధ గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సాధించారు. గ్రూపు విభాగంలో ప్రథమస్థానం గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, ద్వితీయ స్థానం ఉరుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పాలగిరి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం



మామిడి తోటలో అంతర పంటలను పరిశీలిస్తున్న వసంతకుమారి

కమలాపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక ఆదాయం గడించవచ్చని ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం వసంతకుమారి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దచెప్పలిలో కౌలు రైతు బషీరున్ మామిడి తోటలో అంతర పంటలుగా సాగు చేసిన వంగ, బెండ, గోవాకు, మిరప, టమోటా, బంతి తదితర పంటలను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యయసాయం ద్వారా 365 రోజులు పంటలు సాగు చేయవచ్చన్నారు. ఈ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం గడించవచ్చన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు తినడం వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే 15 రోజులకే ఆదాయం వచ్చే పంటలు సైతం పండించవచ్చన్నారు. కౌలు రైతు బషీరున్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, వెలుగు ఏపీఎం అపర్ణదేవి, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మొండి బకాయిదారులకు ముకుతాడు

- రెడ్ నోటీసులు జారీ చేస్తున్న నగరపాలక సంస్థ అధికారులు
- ఆపై లోక్ అదాలత్‌లో కేసులు

కడప కార్పొరేషన్ : అనేక సంవత్సరాలుగా ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకుండా మొండికేస్తున్న యజమానులకు ముకుతాడు వేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు సంబంధిత యజమానులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. వాటికీ స్పందించకపోతే లోక్ అదాలత్‌లో కేసులు వేసి పన్నులు వసూలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

- కడప నగరపాలక సంస్థలో సుమారు 94వేలకు పైగా అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇందులో ప్రైవేటు ఆస్తులకు సంబంధించిన మొండి బకాయిలు రూ.6కోట్లు ఉన్నాయి. ఇందులో రైట్ ఆఫ్ అనగా డబుల్ అసెస్‌మెంట్లు, యజమాని ఎవరో తెలియనివి, పంచాయితీల నుంచి ఉన్న మొండి బకాయిలు సుమారు రూ.2కోట్ల వరకూ ఉన్నాయి. వీటిని మినహాయిస్తే రూ.4కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. వాటిని ఎలాగైనా రాబట్టేందుకు నగరపాలక రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మొదట రెడ్ నోటీసులు జారీ చేస్తారు. ఆ తర్వాత ఫైనల్ నోటీసులు ఇస్తారు. వాటికీ స్పందించకపోతే లోక్ అదాలత్‌కు వేసి కోర్టు తీర్పునుసరించి పన్నులు వసూలు చేయనున్నారు.
- ప్రైవేటు ఆస్తులకు సంబంధించి బకాయిలు, ఈ ఏడాది పన్నులు కలిపితే రూ.42కోట్లు ఉంది. ఇందులో ఇప్పటికే రూ.24 కోట్లు వసూలైంది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ఆస్తి పన్ను బకాయిలు రూ.21.27 కోట్లు ఉండగా, రూ.2.16కోట్లు వసూలైంది. కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆస్తి పన్ను బకాయిలు రూ.1.73కోట్లు ఉండగా రూ.5లక్షలు వసూలైంది. ఖాళీ స్థలాలపై పన్నులు రూ.8.10 కోట్లు ఉండగా, రూ.3.48కోట్లు రాబట్టారు. కరెంట్ బకాయిల వసూలుకు ఇంకా మూడు నెలలకుపైగా సమయం ఉండటంతో నగరపాలక అధికారులు మొండి బకాయిలపై దృష్టి సారిస్తున్నట్లు సమాచారం.

చట్టాల గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న పర్వీన్‌నాజ్

కడప ఎడ్యుకేషన్ : నేటి సమాజంలోని మహిళలు చట్టాలు, హక్కులను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఉమెన్ అండ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ లీగల్ కౌన్సిలర్, అడ్వకేట్ పర్వీన్‌నాజ్, దిశా వన్‌స్టాప్ సెంటర్ సబ్ ఇన్‌స్పెక్టర్ జెడ్‌పీ జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం కడప బాలాజీనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా లైంగిక వేధింపులు చట్టం–2013 పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రతి మహిళా ధైర్యంగా ముందుకు వచ్చి రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత సమాజంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని పాల్గొన్నారు.

• వెచ్చని నేస్తం



ప్రస్తుతం చలి పెరుగుతున్న నేపథ్యంలో కడప నగరంలో స్వెటర్లు, బెడ్‌షీట్లు, రెయిన్ కోట్ల వ్యాపారం ఊపందుకుంది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వ్యాపారులు నగరంలోని పలు కూడళ్లలో వీటిని విక్రయిస్తున్నారు. ఐటీఐ, మరియాపురం, ఎస్పీ బంగ్లా, తదితర ప్రాంతాల్లో వీటి అమ్మకాలు సాగిస్తున్నారు. వీటిని నాణ్యత, సైజును బట్టి రూ.500 నుంచి రూ.800 వరకు అమ్ముతున్నారు. – కడప వైఎస్ఆర్ సర్కిల్

బడుగుల జీవితాల్లో వెలుగై వచ్చిన క్రీస్తు



మాట్లాడుతున్న చర్చి కమిటీ ప్రతినిధి

కడప కల్చరల్ : కరుణామయుడైన ఏసుక్రీస్తు అనాథలు, అభాగ్యుల రక్షణ కోసం వారి జీవితాలలో వెలుగులు నింపేందుకు ఈ లోకానికి వచ్చారని తమిళనాడుకు చెందిన బ్రదర్ టి.టోని దేవ సుందరం అన్నారు. శుక్రవారం కడప నగరం సియోనుపురంలోగల ఐఎన్‌పీసీ చర్చిలో ముందస్తు క్రిస్మస్ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య ప్రసంగీకులుగా హాజరైన బ్రదర్ దేవ సుందరం మాట్లాడుతూ ప్రభువు సూచించిన మార్గాన్ని అనుసరిస్తూ ప్రజలు ప్రేమ, దయ, కరుణ కలిగి జీవించాలని సూచించారు. అనంతరం సంఘం ప్రతినిధులు స్వామిదాసు, వరప్రసాద్‌లు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఉచిత బైబిల్ కోర్సులు నిర్వహిస్తున్నామని, స్వయం ఉపాధి శిక్షణ ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, విశ్వాసులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సామాగ్రిని పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరాబ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు ఏజీఎం విజయ విహారి, కెనరా బ్యాంకు ఆర్ఎం మురళీమోహన్, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం శిక్షణకు అవసరమైన సామాగ్రిని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శిక్షణా సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.